సాక్షి గుంటూరు

శనివారం । 10 । మే । 2025



దుకాణాలు కూల్చివేత

తెనాలిఅర్బన్:బుర్రిపాలెం రోడ్డులోని రైతుబజార్ ముందు షాపులను మున్సిపల్ అధికారులు శుక్రవారం కూల్చి వేశారు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాక నిర్మిస్తామని తెలిపారు.



సమ్మె నోటీసు అందజేత

ఆత్మకూరు(మంగళగిరి): ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసులను శుక్రవారం ఆత్మకూరు పీహెచ్‌సీ అధికారులకు ఆశా వర్కర్లు అందజేశారు.

వైభవంగా సాక్షి భావన్నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం విష్ణుమూర్తి అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి మిర్చి యార్డుకు వేసవి సెలవులు

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు మిర్చి ఎగుమతి, దిగుమతి, కొట్ల కార్మిక సంఘం, మిర్చి యార్డు కాపలా వర్కర్స్ యూనియన్, ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజంట్స్ అసోసియేషన్‌ల అభ్యర్థన మేరకు ప్రస్తుత వేసవి సీజన్‌లో శనివారం నుంచి జూన్ 8వ తేదీ వరకు మిర్చి యార్డుకు సెలవులు ప్రకటిస్తున్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో యార్డులో క్రయ విక్రయాలు జరపబడవన్నారు. జూన్ 9వ తేదీ నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో మిర్చి రైతులు తమ సరుకును యార్డుకు తీసుకురావద్దని సూచించారు. జూన్ 8వ తేదీ అర్ధ రాత్రి నుంచి రైతులు తమ సరుకును యార్డుకు తీసుకురావచ్చని ఆమె తెలిపారు.

ముగిసిన సదరం క్యాంప్



తెనాలిఅర్బన్: వికలాంగుల ధ్రువ పత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఆర్థో, ఈఎన్‌టీ తదితర విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాన్ని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య వాణి పర్యవేక్షించారు.

ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారి ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి తెలిపారు. ఫైనల్ మెరిట్‌లిస్టుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే గుంటూరు వైద్య కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు. వివరాలకు గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

సైనికుల కోసం ప్రత్యేక ప్రార్థనలు



గుంటూరు మెడికల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట శివాలయంలో, జీ.టీ.రోడ్‌లోని మస్తానయ్య దర్గాలో, గస్‌హాల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేశానికి విజయం సిద్ధించాలని.. వీర మరణం పొందిన సైనికుల ఆత్మ శాంతి కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకురాలు డాక్టర్ శనక్కాయల అరుణ, నాయకులు సురేష్ కుమార్ జైన్, షేక్ రఫీ, మలిశెట్టి పవన్ కుమార్, రామకృష్ణ, పోకల పురుషోత్తం, శ్రీనివాస్, దేసు సత్యనారాయణ, దేవిశెట్టి బాబు రావు, మైలవరపు ప్రవీణ్, శనక్కాయల శివ, రామ హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం ట్రాఫిక్ నిలిచిపోయింది. కనకదుర్గ వారధిపై భారీలోడ్‌తో వెళుతున్న లారీ టైర్లు పగిలిపోయాయి. మార్చడానికి గంట పట్టడంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఆగిపోయింది. ఎండ వేడిమి తట్టుకోలేక పలువురు వాహనాలను వెనక్కు మరలించి వెళ్లిపోయారు. ట్రాఫిక్ పోలీసులు లారీ వద్దకు వెళ్లి టైర్లు మార్చేందుకు సహకరించారు. గంట అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. వాహనాలు పూర్తిగా కదలడానికి మరో గంట పైగా పట్టింది.

ఎడిటర్లపై దౌర్జన్యం ప్రజాస్వామ్యానికి ప్రమాదం



సెర్చ్ వారెంట్ లేకుండా ఒక పత్రిక ఎడిటర్ గృహంలో పోలీసు సోదాలు దౌర్జన్యంతో సమానం. ఇది మిగిలిన పత్రిక విలేకరులను భయపెట్టేందుకే. ఇటువంటివి జరిగినప్పుడు ప్రతి పత్రికకు చెందిన విలేకరులు అండగా ఉండాలి. ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యంపై దాడి. ఇదే పరంపర కొనసాగితే ప్రశ్నించే గొంతుకలు మూగబోతాయి. జర్నలిస్టులు నిబ్బరం కోల్పోకుండా తమ విధులను నిర్వహించాలి.

-నల్లపాటి రామారావు , రాష్ట్ర నాయకులు, దేశ భక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం), నరసరావుపేట.

ఇప్పటికే సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్కసు



పత్రికలు, అందులో పనిచేసే వారిపై దాడులు ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చలాంటివి. ఒక పార్టీ ప్రభుత్వం ఈరోజు అధికారంలో ఉంటే మరో పార్టీ ప్రభుత్వం మరోసారి రావొచ్చు. పోలీసులు నిత్యం అన్ని ప్రభుత్వాలలో పని చేయాల్సిన వ్యక్తులు. తమ వ్యవస్థను తామే దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపి వారి గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడే ఉద్యమంలో అందరూ కలసి రావాలి.

– డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం అధ్యక్షులు, పల్నాడు జిల్లా.

ప్రజల గొంతులను నొక్కడానికే...



ఇది ప్రజాస్వామ్యంపై దాడి. పోలీసు వ్యవస్థ ప్రభుత్వం కనుసన్నల్లో నడుస్తుందనే దానికి ఉదాహరణ. సమాజంలో చెడును ప్రశ్నించగలిగే ఒక పత్రిక ఎడిటర్‌పై అనుచితంగా ప్రవర్తించి మీరు కూడా ప్రశ్నిస్తే ఇదే గతి పడుతుందంటూ ముందస్తుగా సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేయటమే. ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదు. ప్రజలే శాశ్వతమనే విషయం పోలీసులు తెలుసుకోవాలి.

-షేక్ మౌలాలి, ఎంఐఎం పట్టణ అధ్యక్షులు, నరసరావుపేట

ప్రశ్నించే గొంతులపై కత్తి



- అప్రజాస్వామిక పోకడలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం
- సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి ఇంటిలో అక్రమ సోదాలు ఇందులో భాగమేనంటున్న ప్రజాస్వామ్యవాదులు
- విలేకరులపై అక్రమ కేసులు, కార్యాలయాలపై దాడులు
- ఇప్పటికే సోషల్ మీడియా యాక్టివిస్టులను జైలుకు పంపిన ప్రభుత్వం
- ప్రభుత్వ అసమర్థ పాలన, ప్రజాకంటక పాలనను ఎండగడుతుండటంతో అక్కసు
- ముక్త కంఠంతో అడ్డుకోని పక్షంలో ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛకు ముప్పు

సాక్షి, నరసరావుపేట: ప్రజల 'సాక్షి'గా ప్రభుత్వ అసమర్థతను అక్షరంతో ప్రశ్నిస్తోన్న గొంతులకు కేసుల ఉచ్చు బిగిస్తున్నారు. ప్రజాస్వామ్య విలువల కోసం అక్షర యజ్ఞం చేస్తోన్న జర్నలిస్టులపై అక్రమ కేసుల కత్తులు దూస్తున్నారు. ప్రజల కన్నీళ్లను పాలకుల కళ్లకు కడుతుంటే ఓర్చుకోలేక నిప్పులు కక్కుతున్నారు. నాయకుడ్ని కేసులు వలయంలో బంధిస్తే వెనుక ఉన్న అక్షర సైన్యం డీలా పడుతుందనే భ్రమలో ముప్పేట దాడి చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ చట్టాలకు ముసుగులు వేసి అక్షరాన్ని బంధించాలనుకుంటున్న కూటమి ప్రభుత్వ తీరుపై జర్నలిస్టులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రభుత్వ అసమర్థ పాలన, ప్రజా కంటక పాలనను ఎండ గట్టినందుకే ఈ అక్కసంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరంపర కొనసాగితే రాష్ట్రంలో ప్రజలకు భావప్రకటన స్వేచ్ఛ లేకుండా పోతుందన్న భయాన్ని వెలిబుచ్చుతున్నారు. దీనిని అంతా ముక్తకంఠంతో ఖండించి అడ్డుకోని పక్షంలో ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నించే గొంతుకలు లేకుండా పోతాయని ప్రజాస్వామ్యవాదులు, రాజకీయ వాదులు బలంగా తమ గొంతుకను వినిపిస్తున్నారు.

కొనసాగుతున్న జర్నలిస్టుల నిరసనలు

పత్రికా స్వేచ్ఛను హరిస్తూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై రెండో రోజైన శుక్రవారం కూడా పల్నాడు, బాపట్ల జిల్లాల్లో జర్నలిస్టులు నిరసన గళం విప్పారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేస్తున్న విషయం విదితమే. శుక్రవారం చిలకలూరిపేటలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. యూనియన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పి.భక్తవత్సలరావు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తే సహించబోమని అన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గురజాలలో జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. మాచర్ల నియోజకవర్గ విలేకరులు కూడా పాల్గొన్నారు. బాపట్ల జిల్లా అద్దంకిలోనూ జర్నలిస్టులు నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమాలలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వంపై వార్తలు రాస్తున్నందుకే సోదాలు...



అధికార పార్టీ, ప్రభుత్వంపై వార్తలు రాస్తున్నారనే అక్కసుతో పోలీసులను ఉపయోగించి అణచివేసేందుకు సర్కారు కుట్రలు పన్నుతోంది. అందులో భాగంగానే సాక్షి ఎడిటర్ ఇంటిలో సోదాలు చేశారని అర్థమవుతుంది. ఏదైనా వార్త పరంగా అభ్యంతరం ఉంటే న్యాయపరంగా ముందుకు వెళ్లాలి తప్ప దౌర్జన్యాలు సరికాదు. ఇటువంటి పోకడలను ప్రభుత్వం మానుకోవాలి.

-షేక్ శిలార్ మసూద్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, నరసరావుపేట

పత్రికా స్వేచ్ఛను హరించలేరు...



ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభంగా చెప్పుకునే మీడియాను నియంత్రించటమంటే ప్రజాస్వామ్యానికే ముప్పుగా భావించాలి. పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా సంపాదకులపై నిర్బంధాలు ఏమాత్రం సబబుకాదు. ఇటువంటి పోకడలతో పత్రికా స్వేచ్ఛను హరించలేరు. ఇది చరిత్ర చెప్పిన నిజం. ఏ ప్రభుత్వమైనా ఇది తెలుసుకోవాలి.

- కాసా రాంబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి, నరసరావుపేట.

ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుంది...



ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కార వేదికగా పని చేసే సాక్షి, సాక్షి ఎడిటర్ పై ప్రభుత్వ దుందుడుకు చర్యను పిరికిపంద చర్యగా భావిస్తున్నాం. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చూసుకోవాలి. లేకపోతే ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుంటారు.

– డాక్టర్ గోదా రమేష్ కుమార్, దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు.

గృహ యోగంలో అవినీతి పర్వం

- పేదల ఇళ్లను వదలని సచివాలయ ఉద్యోగులు
- ఇళ్లు నిర్మించేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.50వేల నుంచి లక్ష వసూలు
- బాధితుల ఫిర్యాదులతో వెలుగు చూస్తున్న అక్రమాలు



అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావుకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

తెనాలి అర్బన్: పేదల సొంతింటి కలకు కొందరు సచివాలయ ఉద్యోగులు తూట్లు పొడిచారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలందరికీ నివాస స్థలాలతో పాటు గృహాలు కూడా నిర్మించాలని భావించి చేపట్టిన పథకాన్ని నీరు గార్చే పనికి పూనుకున్నారు. ఇళ్ల నిర్మాణ పనులను ఆసరాగా చేసుకుని పేదలను దోచుకున్నారు. ఇటు నిర్మాణాలు జరగక, అటు డబ్బు తిరిగి రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు తీసుకున్న నగదును తిరిగి ఇప్పించాలని ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

19వేల మందికి స్థలాల పంపిణీ

తెనాలి పరిధిలోని గోలి డొంక, నేలపాడు, బుర్రిపాలెం, పెదరావూరు, జగ్గడిగుంటపాలెంతో పాటు సిరిపురంలో అధికారులు స్థల సేకరణ జరిపారు. తెనాలి పట్టణంలోని 19వేల మందికి ఆయా ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. మొదటి విడత కింద 9,907 మందిని ఎంపిక చేసి, వారిని గృహాలు నిర్మించుకోవాలని సూచించారు.

చేతివాటం ప్రదర్శించిన ఎమినిటీ సెక్రటరీలు

పేదల ఇళ్ల నిర్మాణ పనులను వార్డు సచివాలయ పరిధిలోని ఎమినిటీ సెక్రటరీలకు ఉన్నతాధికారులు అప్పగించారు. వారిపై హౌసింగ్ విభాగ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, డీఈలు, ఈఈలు ఉంటారు. వీరు కూడా అప్పుడప్పుడు వెళ్లి పనులు పర్యవేక్షించేవారు. ఈ సమయంలో నేరుగా లబ్ధిదారులతో ఎమినిటీ సెక్రెటరీలకు సంబంధాలు ఉండటంతో వారు అవినీతికి తెర తీశారు. ఇళ్ల నిర్మాణాలను త్వరగా కాంట్రాక్టర్లతో పూర్తి చేయిస్తామని, రోడ్లు, మురుగు కాల్వలు ఇతర మౌలిక వసతులను చేయిస్తామని నమ్మబలికారు. దీంతో లబ్ధిదారులు కొందరు వారికి రూ.50వేల నుంచి లక్ష వరకు చెల్లించారు.

ఇసుక, ఇనుము సరఫరాల నిలిపివేత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, ఇనుము సరఫరాలను నిలిపివేసింది. దీంతో లబ్ధిదారులు తమ వద్ద తీసుకున్న నగదు చెల్లించాలని ఎమినిటీ సెక్రటరీలను కోరారు. తీసుకున్న నగదును కాంట్రాక్టర్‌కు ఇచ్చామని, దానిలో కొంత మాత్రమే తాము తీసుకున్నామని, దాన్ని తిరిగి చెల్లిస్తామని లబ్ధిదారులకు చెప్పారు. రోజులు గడుస్తున్నా నగదు అందకపోవటంతో మున్సిపల్ అధికారులను కలిసి లబ్ధిదారులు మొరపెట్టుకున్నారు.


పనులు చేయకుండా ముందే చెల్లింపులు

తెనాలి పట్టణంలో జరిగిన ఇళ్ల నిర్మాణాలలో హౌసింగ్ అధికారులు అలసత్వంతో వ్యవహరించారు. బేస్ మట్టం పూర్తి చేసి పిల్లర్స్ వేసే దశ రాగానే మెప్మా టీఎఫ్ఎం, హౌసింగ్ డీఈల జాయింట్ అకౌంట్‌లో ఉన్న నగదును కాంట్రాక్టర్లకు చెల్లింపులు జరిపారు. నేటికీ పనులు చేయకుండా, నగదును తిరిగి చెల్లించకుండా వారు తాత్సారం చేస్తున్నారు. ఇందులోనూ కొందరు అధికారులు అవినీతికి పాలు పడ్డారనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని పలువురు లబ్ధిదారులు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వార్డు పర్యటనల సమయంలో ఫిర్యాదులు చేశారు. ఆయన వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీస్, హౌసింగ్ అధికారులను ఆదేశించినా, ఆ దిశగా నేటికీ అడుగులు పడలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి అవినీతికి పాల్పడిన సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇవిగో అక్రమాలు..

- తెనాలి 28వ వార్డు 33వ సచివాలయ పరిధిలోని ఎమినిటీ సెక్రటరీ నవీన్ ఇస్లాంపేటకు చెందిన షేక్ చాందినీ వద్ద రూ.1.08 లక్షలు, చెంచుపేటకు షేక్ హసీనా వద్ద రూ.50వేలు తీసుకున్నాడు. ఆ నగదు చెల్లించాలని లబ్ధిదారులు కోరడంతో గత నెల చివరికి ఇస్తానని అతడు రాతపూర్వకంగా ఒప్పుకున్నాడు. నగదు చెల్లించకపోవడంతో వారు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌ను కలిశారు. నగదును ఇప్పించాలని కోరారు.
- 32వ వార్డు 37వ సచివాలయ పరిధిలోని ఉద్యోగి కూడా ఇలాగే చేశాడని అధికారులు తెలిపారు. నగదు చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో అతడు ఏడాది నుంచి విధులకు గైర్హాజరు అవుతున్నట్లు సమాచారం. ఇలా పట్టణ పరిధిలోని అనేక మంది ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది.

ఫిర్యాదులు వాస్తవమే..



పేదలకు ఇళ్లు నిర్మిస్తామని కొందరు సచివాలయ ఎమినిటీ సెక్రటరీలు అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తున్న మాట వాస్తవమే. సంబంధిత సెక్రటరీలను పిలిపించి మాట్లాడాం. నగదును తిరిగి చెల్లించాలని సూచించాం. వారు అలా చేయకపోతే చర్యలు తీసుకుంటాం.

-వి.ఎం. లక్ష్మీపతిరావు, అసిస్టెంట్ కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

'పచ్చ' నేతలను మెప్పించేందుకే పోలీసులా?

- హద్దులు మీరుతున్న పోలీసుల అరాచకాలు
- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఖాకీలు
- వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు ధ్వజం



రిమాండ్ విధించడంతో కోర్టు వద్ద రోదిస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు కల్పన కుటుంబ సభ్యులు



కోర్టు ప్రాంగణం నుంచి బయటకు వస్తున్న అంబటి రాంబాబు, డైమండ్ బాబు, వేమారెడ్డి

మంగళగిరి టౌన్: కూటమి నాయకుల్ని మెప్పించేందుకే పోలీస్ వ్యవస్థ పని చేస్తోందా ? అంటూ వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యురాలు కల్పన, సోషల్ మీడియా యాక్టివిటీ కర్రి విజయ భాస్కర్, మహిళా కార్యకర్త కర్రి మహాలక్ష్మి, ఆమె కుమారుడు నిఖిల్‌ను తాడికొండ పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు అరెస్ట్ చేసి, ఉదయం 11 గంటలకు కోర్టుకు హాజరుపరిచారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, గుంటూరు నగర డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు), మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి కోర్టు వద్దకు చేరుకున్నారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈనెల 25న చిన్నపిల్లలు గొడవ పడిన విషయాన్ని తీసుకువచ్చి, రాజకీయ ఒత్తిడితో కల్పన, మరికొందరిపై పోలీసుల తప్పుడు కేసు పెట్టారని విమర్శించారు. తెల్లవారుజామున 3 గంటలకు 30 పోలీసులు ఆమె నివాసంలోకి ప్రవేశించి అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. పోలీసులు ఇచ్చిన రిమాండ్ రిపోర్ట్‌లో ఉదయం 6.30 గంటలకు అరెస్ట్ చేసినట్లు చూపించారని ఆరోపించారు. ఇలా పచ్చి అబద్ధాలు ఆడే పరిస్థితి, పోలీసులు దిగజారి పోవాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని అంబటి ప్రశ్నించారు. కోర్టులో వాదనలు విన్న న్యాయమూర్తి ముద్దాయిలుగా ఉన్న నలుగురిని ప్రశ్నించగా, తెల్లవారుజామున 3.30 గంటలకు కి పోలీసులు వచ్చి తీసుకు వెళ్లారని చెప్పారని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌లో రాడ్లు, కర్రలతో కొట్టినట్లు ఉందని, అటెంటు మర్డర్ కింద కేసు నమోదు చేశారని తెలిపారు. కానీ ఎదుటి వారిపై ఎక్కడా గాయాలు గానీ, ఆసుపత్రిలో అడ్మిట్ కావడం గానీ, డాక్టర్ సర్టిఫికెట్లు గానీ పొందుపరచలేదని తెలిపారు. అయినా సరే న్యాయమూర్తి ముద్దాయిలను 14 రోజులు రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది

అక్రమ అరెస్టులకు గురైన ఎంపీటీసీ సభ్యురాలు కల్పనతో పాటు మరో ముగ్గురికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని గుంటూరు నగర డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా వజ్రబాబు (డైమండ్ బాబు) అన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని, తప్పుడు కేసులు పెట్టే వారిపై చర్యలు తీసుకునే విధంగా పార్టీ స్టాండ్ తీసుకుంటుందని తెలిపారు. ఏప్రిల్ 25న పిల్లలను కొట్టిన ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా, తరువాతి రోజు జరిగిన గొడవను అప్పటిప్పుడే హత్యాయత్నం కింద కేసు నమోదు చేయడం పలు అనుమానాలను రేకెత్తించే విధంగా ఉందని పేర్కొన్నారు.

ఆస్తి కోసం తండ్రిని హత్య చేసిన కుమారుడు

మంగళగిరి/మంగళగిరి టౌన్ : బేతపూడిలో శుక్రవారం రాత్రి కన్న తండ్రిని కుమారుడు హత్య చేసిన ఘటన చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు... బేతపూడికి చెందిన అడవి శ్రీనివాసరావు(52)కు ఇద్దరు కుమారులు పరమేశ్వరరావు, శివ ప్రసాద్‌లు ఉన్నారు. తండ్రి, కుమారుల మధ్య ఆస్తి వివాదం కొనసాగుతోంది. ఆస్తిని తమకు పంచకుండా నాశనం చేస్తున్నాడని కోపం పెంచుకున్న పెద్ద కుమారుడు పరమేశ్వరరావు శుక్రవారం రాత్రి శ్రీనివాసరావు బంధువుల ఇంటి సమీపంలో ఉండగా అకస్మాత్తుగా దాడి చేసి రాళ్లతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. గాయాలపాలైన శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం చిన్న కుమారుడు శివప్రసాద్ అక్కడికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు కుమారులు పరారీలో ఉన్నారు. శ్రీనివాసరావు భార్య కోటేశ్వరమ్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పని విధానంలో మార్పు రాకపోతే కఠిన చర్యలు

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై మంత్రి మనోహర్ ఆగ్రహం



కొత్తపేటలో పర్యటిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్: ''ఉదయం 10గంటలు అయినా రోడ్లపై ఎక్కడ చెత్త అక్కడే ఉంటుంది.. ప్రతి రోజు ఉదయాన్నే చెత్త సేకరణ చేయాలని ఇప్పటికే ఆదేశించినా.. మీలో మార్పు రావడం లేదు.. మీరు ఇక మారారా ?'' అంటూ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావుపై రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం మరొకసారి ఈ ప్రాంతానికి వస్తానని.. ఆ లోపు కొత్తపేటలో వ్యర్థాలు కనిపించకూడదంటూ హెచ్చరించారు. కొత్తపేటలో శుక్రవారం ఆయన పర్యటించారు. రోడ్లపై చెత్త ఉండటాన్ని గమనించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. మురుగు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే బాగు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. పని విధానంలో మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మహిళ మండలి భవనాన్ని పరిశీలించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. వచ్చే వారంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సూరిబాబు, మంత్రి ఓఎస్‌డీ ఏసురత్నం, ఏసీపీ శివన్నారాయణ, పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,800** గరిష్ఠం : రూ. **5,000**

మోడల్ ధర రూ. **4,000**

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	85,708
అమ్మకాలు (గత నిల్వలతో కలిపి)	96,112
నిల్వ	17,960

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 - 13,400
నంబరు-5	రూ. 10,000- 12,500
341	రూ. 10,000 -13,300
4884	రూ. 10,000 -11,200
సూపర్-10	రూ. 10,000 -12,600
తాలుకాయలు	రూ. 4,500 - 6,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 -14,000
షార్క్-1	రూ. 10,000 - 12,000
బాడిగ - 355	రూ. 10,000 - 13,000
దేవనూరు డీలక్స్	రూ. 10,000 - 12,500
ఆర్మూర్	రూ. 9,800 - 11,200
తాలు	రూ. 4,500 - 6,500

-కొరిటెపాడు (గుంటూరు)

క్లుప్తంగా

పసుపు ధరలు



దుగ్గిరాల: పసుపు యార్డుకు శుక్రవారం 1,489 బస్తాలు వచ్చాయి. మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 1107, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,000. గరిష్ఠ ధర రూ. 11,400, మోడల్ ధర రూ.10,550 పలికింది. కాయలు 382 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,000, గరిష్ఠ ధర రూ.10,900, మోడల్ ధర రూ.10,550 లభించింది. యార్డులో మొత్తం 1116.750 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు కార్యదర్శి పేర్కొన్నారు.

అమ్మవారికి లక్ష మల్లెల పూజ



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి జయంతి మహోత్సవం శుక్రవారం కొనసాగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు లక్ష మల్లెల పూజను నిర్వహించారు. యువతులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఈరంటి వరప్రసాద్‌బాబు, కొనకళ్ల సత్యం, కోట శేషగిరి, అవరపల్లి శ్రీను, అన్నవరపు చక్రి పర్యవేక్షించారు.

ఎండు గడ్డి ధరకు రెక్కలు

- ఎకరా రూ.7వేలు
- పశుగ్రాసం కొరత
- పాడి రైతుల ఇక్కట్లు



ట్రాక్టర్‌పై ఎండు గడ్డి కొనుగోలు చేసి తెస్తున్న రైతు

ఫిరంగిపురం: ఈ ఏడాది ఎండుగడ్డి ధరలు అమాంతం పెరగడంతో పాడి రైతులు ఇక్కట్లు పడుతున్నారు. మండలంలో పత్తి, మిర్చి ఎక్కువగా వేయడం , వరి తక్కువగా వేయడంతో కొరత ఏర్పడింది. దీంతో పొన్నూరు , తెనాలి, కొల్లూరు, కొల్లిపర, బాపట్ల ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తీసుకు వస్తున్నారు. అక్కడ ఎకరా గడ్డి ధర రూ.7 వేలు ఉంది. దాన్ని ట్రాక్టర్‌పై వేసినందుకు రూ.2 వేలు, రవాణా ఖర్చులు రూ.6వేలు కలిపి రూ.15వేలు అవుతోంది. పశువులకు ఏడాదికి సరిపడా వరిగడ్డి నిల్వ చేసుకోవాలంటే ఒక్కోదానికి సుమారు వంద మోపుల చొప్పున గడ్డి కావాలి. ఎకరాకు 80 కట్టలు మాత్రమే వస్తున్నాయి. దీంతో రైతులు రెండెకరాల గడ్డి కొనుగోలు చేయక తప్పడం లేదు. ట్రాక్టర్‌కు రెండు ఎకరాల గడ్డి అంటే సుమారు 160 కట్టలు దాకా వస్తాయి. రవాణాకు రూ.22వేలు వరకు రైతులు ఖర్చు చేయాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మరో రెండు వేల రూపాయల వరకు బీపీటీ గడ్డికి చెల్లించాల్సి వస్తోంది.

పాడి పైనే ఆధారం

మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయం తరువాత ఎక్కువ మంది పాడిపైనే ఆధార పడుతుంటారు. మండలంలోని 18 గ్రామాల్లో ఆవులు, గేదెలు సుమారు 9వేల పైచిలుకు ఉన్నాయి. వీటి పోషణ కోసం భారీగా ఎండుగడ్డి కొనుగోలు చేయాల్సి వస్తోంది. వేసవిలో పచ్చిగడ్డి తక్కువగా ఉండటంతో మరలా పంటలు వేసే వరకు పశువులకు ఎండు గడ్డి వేయక తప్పదు. వేసవిలో పచ్చి మేత లేక ఇప్పటికే పాల శాతం పడిపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు అధిక ధర చెల్లించి ఎండు గడ్డి తెచ్చుకుంటున్నారు. మరి కొందరు అంత ధర చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. మొక్క జొన్న, గడ్డిజొన్న చొప్పను పశుగ్రాసంగా వేయడంతో పాల దిగుబడి పడిపోతోంది. ఎండు గడ్డి ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ధరకు అందించాలని పలువురు పాడి రైతులు కోరుతున్నారు.

రెండు ఎకరాలు కొన్నా !



నాకు నాలుగు పశువులు ఉన్నాయి. వాటికి పచ్చి గడ్డి కొరతగా ఉండటంతో తెనాలి ప్రాంతం నుంచి గడ్డిని కొనుగోలు చేశా. రవాణా ఖర్చులతో కలిపి రూ. 23 వేల వరకు అయింది. ఏడాదికి సరిపోతుంది. ధర ఎక్కువైనా కొనుగోలు చేయక తప్పలేదు.

-చిట్టా హనుమంతురెడ్డి, రేపూడి

ప్రభుత్వమే సరఫరా చేయాలి



పశువులకు మేత చాలా ఇబ్బందిగా ఉంది. గత సంవత్సరం మాదిరి ఈ ఏడాది కూడా గడ్డి ధరలు ఆకాశాన్ని అంటాయి. మొదట్లో రెండు వేలు హెచ్చుగా ఉండి తరువాత కొద్దిగా ధర తగ్గింది. ప్రభుత్వం స్పందించి రైతులకు తక్కువ ధరకు అందజేయాలి.

- బద్దూరి బలరామిరెడ్డి, రేపూడి

బీఆర్ స్టేడియం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- రూ.1.60 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్రంలోనే పలు ప్రత్యేకతలు ఉన్న బీఆర్ స్టేడియం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. పాత గుంటూరులోని స్టేడియం ప్రహరీ గోడలకు శుక్రవారం తూర్పు నియోజకవర్గ శాసన సభ్యుడు మొహమ్మద్ నసీర్ అహ్మద్, డెప్యూటీ మేయర్ షేక్ సజీలతో కలిసి కలెక్టర్ శంకుస్థాపన చేశారు. అనంతరం స్టేడియంలో కలియతిరిగి, అధికారుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో క్రీడాకారులకు జీవితాలను ప్రసాదించిన స్టేడియం అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. తొలి దశలో కాంపౌండ్ వాల్ సహా కొన్నింటికి రూ.1.60 కోట్లతో పనులు జరుగుతాయని తెలిపారు. తూర్పు నియోజకవర్గ శాసన సభ్యుడు మొహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ సుమారు 18 ఎకరాల్లో స్టేడియం విస్తరించి ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఖేల్ ఇండియా, సీఎస్ఆర్ నిధులు, శాప్ ద్వారా స్టేడియం అభివృద్ధికి డీపీఆర్ తయారు చేయించామని చెప్పారు. రాబోయే రోజుల్లో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం పిల్లలు చదువుల మీద ద్యాస కారణంగా పెద్దగా క్రీడలవైపు రావడంలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో వారికి అహ్లాదకరమైన వాతావరణంలో క్రీడా మైదానాలు రూపొందించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్, స్కేటింగ్, క్రికెట్ వాలీబాల్, ఇండోర్ గేమ్స్‌కు రూ.100 కోట్లతో అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. ఇదే క్రీడా మైదానంలో ఆడుకుని దాని అభివృద్ధికి అవకాశం రావడం గొప్ప అదృష్టంగా బావిస్తున్నానని నసీర్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహా రెడ్డి, జిల్లా ఒలింపిక్ అధ్యక్షులు చల్లా వెంకటేశ్వర రెడ్డి, స్థానిక కార్పొరేటర్ పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యానికి అన్నమయ్య కృషి అసామాన్యం



రాయదుర్గం శ్యాం కుమార్, తులసీబాయి అన్నమయ్య సంకీర్తనల ఆలాపన

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సాహిత్యం, సంగీతం, కవితా వికాసానికి తాళ్లపాక అన్నమాచార్యుల కృషి అసామాన్యమని గుంటూరు జిల్లా అటవీ శాఖ అధికారి హిమ శైలజ అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో శుక్రవారం అన్నమయ్య జయంతి సందర్భంగా నిర్వహించిన కీర్తనల రాష్ట్ర స్థాయి పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు తొలి వాగ్గేయకారునిగా 32 వేలకు పైగా కీర్తనలను స్వరపరిచి, తెలుగు భాషా వైభవానికి విశేష కృషి చేశారని కొనియాడారు. గొప్ప వైష్ణవ భక్తునిగా శ్రీ వేంకటేశ్వరస్వామిని సేవించి, స్వామివారి సాక్షాత్కారం పొందిన మహా భక్తుడు తాళ్లపాక అన్నమాచార్యులు అని కీర్తించారు. భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు కృషి అమోఘమైనదని తెలిపారు. రామచంద్రరాజు మాట్లాడుతూ తెలుగు వారి లోగిళ్లలో అన్నమయ్య సంకీర్తనలు లేని రోజులు ఉండవని తెలిపారు. గొప్ప వాగ్గేయకారులైన క్షేత్రయ్య, త్యాగయ్య, రామదాసు వంటి వారితో పాటు నేటి మంగళంపల్లి బాలమురళీకృష్ణ వంటి వారికి మార్గదర్శకులని పేర్కొన్నారు. సంగీత, సాహిత్య అంశాల్లో ప్రతిభ కలిగిన బాలబాలికలతో పాటు యువతీ, యువకులను సమాజానికి పరిచయం చేయాలన్న సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం - అన్నమయ్య ప్రాజెక్టు గాయకులు డాక్టర్ రాయదుర్గం శ్యాం కుమార్, తులసీబాయిల అన్నమయ్య సంకీర్తనల కచేరి ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో మహిళా సంగీత సన్మండలి అధ్యక్షురాలు శేష రాణి, ఇంటాక్ సభ్యులు సీతా రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ హేమాంబ, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ ఉషశ్రీ పాల్గొన్నారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి



ఫ్లారెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నర్సుల సంఘం నేతలు

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శుశ్రుత హాలులో జరిగిన వేడుకల్లో సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆసుపత్రిలో నర్సుల సేవలు ఎంతో కీలకమని, రోగులు త్వరితగతిన వ్యాధి నుంచి కోలుకోవడంలో వారి పాత్ర ప్రముఖమని తెలిపారు. ఆసుపత్రికి మూలస్తంభాలుగా నర్సింగ్ సిబ్బంది ఉంటారని, వారి సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. ఏడాదిలోపు పదవీ విరమణ చేయనున్న హెడ్ నర్సులు రాజవర్ధని, రాజ్యలక్ష్మి, బాలమంజరి, గాయత్రి, శౌరి సంగీత, కృపమ్మలను సంఘం నేతలు సత్కరించారు. వీరితోపాటు గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్లు కిరణ్మయి, గంగమ్మ, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లు ఆవుల విజయ, రమాదేవి, నాంచారమ్మ, జయలక్ష్మిలను సత్కరించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో నర్సుల సంఘం జిల్లా సెక్రటరీ వెల్లంపల్లి పద్మజ, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, కోశాధికారి పారాబత్తిన హేమలత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎం.ఆషాలత, పి.సునీత, పెనుమాక సుధారాణి, భూలక్ష్మి, గోగుల అరుణ పాల్గొన్నారు.

బాలికల వసతి భవనానికి శంకుస్థాపన



వినుకొండ: పట్టణంలోని ఎన్ఎస్‌పీ స్థలంలో రూ. 2.50 కోట్లతో చేపట్టబోయే కస్తూర్బాగాంధీ బాలికల వసతి భవనం నిర్మాణానికి నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బాలికల విద్యకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. చీఫ్ విప్ జీవీ మాట్లాడుతూ బాలికల విద్యకు ప్రభుత్వ అన్ని విధాలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యను కాపాడాలి



డీఆర్వో షేక్ ఖాజావలికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు వెస్ట్: పాఠశాల విద్యను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్వో షేక్ ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 12న విద్యా వ్యవస్థపై ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతి పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు ఉంచాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థి నిష్పత్తి 1:20 మాత్రమే ఉండాలని కోరారు. అన్ని పాఠశాలల్లో తెలుగు మీడియం కొనసాగించాలని విన్నవించారు. పదోన్నతులు, బదిలీలు వేర్వేరుగా నిర్వహించాలని చెప్పారు. మున్సిపల్ హైస్కూల్స్‌లోని పోస్టులన్నీ అప్‌గ్రేడ్ చేసి టీచర్లకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రజల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా కార్యదర్శులు ఎం.గోవిందు, కె.రంగారావు, ఎం.కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పీఏనంటూ ఫోన్.. వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పీఏని అంటూ నగరపాలక సంస్థ కమిషనర్‌కు, పలు విభాగాల అధికారులకు ఫోన్ చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. ఎమ్మెల్యే గౌరవానికి భంగం కలిగేలా వ్యవహరిస్తున్న ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాల్సిందిగా పీఏ పంగులూరి పుల్లయ్య నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశారు. గుంటూరులోని సాయినగర్‌లో నగరపాలక సంస్థ అధికారులు సక్రమంగా పని చేయడం లేదని, వీధి లైట్లు వెలగడం లేదని, శానిటరీ వర్కర్లు రావడం లేదని ఆ వ్యక్తి ఫోన్ చేసి పేర్కొంటున్నాడు. మాచర్ల ఎమ్మెల్యే పీఏ పుల్లయ్య నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారుల అత్యుత్సాహం

- వైఎస్సార్ సీపీ నాయకుడి దుకాణం కూల్చివేత
- అదే రోడ్డులో టీడీపీ నాయకుల దుకాణాల జోలికి వెళ్లలేదు



పట్టణ ప్రణాళిక విభాగం అధికారులుతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ

పెదవడ్లపూడి(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అత్యుత్సాహంతో వైఎస్సార్ సీపీ నాయకుడి దుకాణం కూల్చివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధితుడి సద్దామ్ హుస్సేన్ తెలిపిన వివరాల మేరకు.. నగర పరిధిలోని పెదవడ్లపూడి కొత్తపాలెం రోడ్డు పక్కన దుకాణం నిర్మించుకుని చికెన్ షాపు పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. అదే రోడ్డు పక్కన ఆక్రమించి టీడీపీ నాయకుడు కొత్తగా చికెన్ దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. తన వ్యాపారం కోసం సద్దామ్ హుస్సేన్ దుకాణం తొలగించేందుకు అధికారులకు ఫిర్యాదు చేశాడు. టీడీపీ నాయకుడు దుకాణంపై ఎన్నిసార్లు ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని అధికారులు మాత్రం వైఎస్సార్ సీపీ నాయకుడి దుకాణంపై ఫిర్యాదుకు వెంటనే స్పందించారు. శుక్రవారం రాత్రి ఏసీపీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీలను తీసుకెళ్లి దుకాణాన్ని వెంటనే తొలగించుకోవాలని సద్దామ్ హుస్సేన్‌ను ఆదేశించారు. లేనిపక్షంలో ధ్వంసం చేస్తామని బెదిరించి, అతడితోనే దుకాణాన్ని తొలగింపచేశారు. సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాలి మురళీకృష్ణ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అన్ని దుకాణాలు తొలగించాలని, వైఎస్సార్ సీపీ నాయకుడు దుకాణం ఒక్కటే ఎందుకు తొలగిస్తారని ప్రశ్నించినా అధికారులు పట్టించుకోలేదు. దుకాణం తొలగించి టీడీపీ నాయకులను సంతృప్తి పరచడంపై సద్దామ్ హుస్సేన్‌తో పాటు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల విద్యపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు



ధర్నాలో మాట్లాడుతున్న వరప్రసాదరావు

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా పని చేయడం లేదని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు విమర్శించారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలతో ప్రాథమిక పాఠశాల వ్యవస్థ మనుగడ కష్టసాధ్యంగా మారిందని తెలిపారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ 117ను మంత్రి నారా లోకేష్ రద్దు చేస్తానని చెప్పినా, దానిని పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలల వ్యవస్థను ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థను ఏర్పాటు చేసి మరింత గందరగోళం సృష్టిస్తుందని చెప్పారు. కేవలం 1, 2 తరగతులతో ఫౌండేషన్ పాఠశాలల ఏర్పాటు సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. ధర్నాకు అధ్యక్షత వహించిన కె.బసవలింగారావు మాట్లాడుతూ బదిలీల్లో ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న భౌతిక శాస్త్ర, తెలుగు స్కూల్ అసిస్టెంట్స్ తప్పనిసరి చేస్తూ వారి స్థానంలో మరొక స్కూల్ అసిస్టెంట్‌ను తీసుకురావాలనుకోవడం అధికారుల నియంతృత్వానికి నిదర్శనమని విమర్శించారు. ప్రతి ప్రాథమికోన్నత పాఠశాలకు కనీసం ఆరుగురు స్కూల్ అసిస్టెంట్ పోస్టులివ్వాలని కోరారు. అంగవైకల్యం ఉన్న ఉపాధ్యాయులకు కోర్ట్ కేసులతో సంబంధం లేకుండా కోరుకున్న చోట ఉండేట్లు చూడాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీదా, ఎం.ఎస్ మూర్తి, ఎం. హనుమంతవవు, నాగాన్నారాయణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గుంటూరులో స్లీపర్ సెల్స్ సంచారం

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.పాండురంగవిఠల్



సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగ విఠల్

గుంటూరు మెడికల్ : సరిహద్దులలో భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశంతో పాటు అనేక పట్టణాల్లో స్లీపర్ సెల్స్ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.పాండురంగ విఠల్ తెలిపారు. బీజేపీ గుంటూరు రూరల్ మండలం అత్యవసర సమావేశం శుక్రవారం అధ్యక్షుడు కంచర్ల రాజేష్ అధ్యక్షతన బ్రాడీపేటలోని కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాండురంగవిఠల్ మాట్లాడుతూ ప్రస్తుతం స్లీపర్‌సెల్స్ దేశం వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, గుంటూరు పట్టణంలోనూ వారు ఉన్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, రోహింగ్యాలు సంచరిస్తున్నారని వార్తలు వస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అధికారులు, పోలీసులు వెంటనే దీనిపై విచారణ చేసి వారిని అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తీర్పులెప్పుడూ చట్టాలకు లోబడే ఉండాలి

గుంటూరు లీగల్: జిల్లా కోర్టులోని జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాలకు శుక్రవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జూనియర్ సివిల్ న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమానికి ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి జి.చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు (పీడీఎం) న్యాయమూర్తి వి.దీప్తి, మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎం.జగదీశ్వరి, రెండవ అదనపు జూనియర్ కోర్టు న్యాయమూర్తి డి.ధనరాజ్, నాల్గవ అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎం.శోభారాణి, ఆరో అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ గౌస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి మేరీ శారాధనమ్మ పాల్గొన్నారు. ఫ్యామిలీ కోర్ట్ న్యాయమూర్తి చక్రపాణి న్యాయమూర్తుల విధివిధానాలను వివరించారు. తీర్పులు చేప్పేటప్పుడు అపోహలకు గురి కావద్దని తెలిపారు. అవి ఎప్పుడూ చట్టాలకు లోబడి ఉండాలని, పరిధిని దాటొద్దని సూచించారు. న్యాయవాదులను జూనియర్, సీనియర్ అంటూ చూడొద్దని, అంతా సమానమేనని తెలిపారు. కేసు చేసే విధానాన్ని బట్టి తీర్పు ఇవ్వాలని చెప్పారు.గుంటూరు కోర్టుకు రాష్ట్రంలోనే మంచి పేరు ఉందని, ఇక్కడి న్యాయవాదులు మంచి నైపుణ్యత కలిగిన వారని పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా కేసుల్లో నైపుణ్యాన్ని కనబరుస్తారని కొనియాడారు. గతంలో మూడవ అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన ఎం.శోభారాణి మరలా నాలుగవ అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తిగా రావటం అభినందనీయమన్నారు. పలువురు న్యాయమూర్తులు మాట్లాడుతూ గుంటూరు కోర్టులలో పని చేయడానికి గర్వపడుతున్నామని తెలిపారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌గా మదార్ సాహెబ్ బాధ్యతల స్వీకరణ



షేక్ మదార్ సాహెబ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జేబీఆర్, పోలూరి, కేశవరెడ్డి

మాచర్ల: పట్టణానికి నూతనంగా పురపాలక సంఘ చైర్మన్‌గా షేక్ మదార్ సాహెబ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 11గంటలకు మాచర్ల పురపాలక సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఐదు రోజుల కిందట వైస్ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన మదార్ సాహెబ్‌ను చైర్మన్‌గా కౌన్సిల్ నిర్ణయించింది. అంతకుముందు ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్‌గా వ్యవహరించిన పోలూరి నరసింహరావు పదవికి రాజీనామా చేయగా.. ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా మదార్ చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కౌన్సిల్ పూర్తి స్థాయిలో పురపాలక సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. షేక్ మదార్ సాహెబ్ మాట్లాడుతూ తన చిరకాల వాంఛ అయిన మున్సిపల్ చైర్మన్ పదవి స్వీకరించటానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పోలూరి నరసింహారావు, టీడీపీ నియోజక వర్గ నాయకులు యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు కలిసి పూలమాలలు వేసి సత్కరించారు.